సాక్షి వికారాబాద్

శనివారం । 14 । డిసెంబర్ । 2024



పెళ్లిచేసుకోమన్నందుకు..

వివాహిత గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. 8లో▸



పురుగుల అన్నమే దిక్కా!

ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸



మల్లన్న జాతరకు వేళాయె..

భక్తుల కొంగు బంగారంగా విశ్వాసం పొందిన మల్లన్నస్వామి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 9లో▸

హాస్టళ్లకు అనారోగ్యం!

- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో ఆస్పత్రి పాలవుతున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- కారణాల అన్వేషణలో అధికారులు

జిల్లాలో మొత్తం వసతి గృహాలు: **125**

ప్రభుత్వ పాఠశాలలు: **1,060**

విద్యార్థులు: **90** వేల మంది

ప్రతి నెల వినియోగిస్తున్న బియ్యం: **450** టన్నులు

తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు



తాండూరు టౌన్: ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలు

వికారాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తరచూ ఇవి పునరావృతం కావడంతో ఆత్మరక్షణలో పడిపోయారు. దీంతో ఎందుకిలా జరుగుతోందనే కారణాలను అన్వేషించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కలెక్టర్, డీఈఓ, ఎంఈఓలు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు.

నిల్వ బియ్యమే కారణమా..?

హాస్టళ్లలో వండుతున్న భోజనం విషతుల్యం కావడంలో నిల్వ చేసిన బియ్యం వండటమే ప్రధాన కారణమని తెలుస్తోంది. జిల్లాలోని ఆయా హాస్టళ్లు, పాఠశాలలకు పంపిణీ చేసిన నిల్వ బియ్యాన్ని వెంటనే వెనక్కి పంపించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న హాస్టళ్లలో ఐదారు బ్యాగుల బియ్యం నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇవి ముక్కిపోవటం, పురుగు పట్టడాన్ని గమనించారు. ఆయా హాస్టళ్ల వార్డెన్లు పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని డిసైడయ్యారు.

ప్రతీ నెల 450 మెట్రిక్ టన్నుల బియ్యం..

జిల్లాలో 125 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల, ఆశ్రమ, కస్తూర్బా హాస్టళ్లు ఉన్నాయి. వీటితో పాటు 1,060 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. డే స్కాలర్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, హాస్టల్ విద్యార్థులకు మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు. మొత్తం 90 వేల మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరికోసం సివిల్ సప్లయ్ అధికారులు ప్రతీ నెల 450 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాల్లో.. సెలవులు అధికంగా వచ్చిన సమయంలో క్వింటాళ్ల మేర బియ్యం నిల్వ ఉండిపోతున్నాయి. మరుసటి నెల కోటా బియ్యాన్ని సైతం తెచ్చి డంప్ చేయడంతో నిల్వలు పేరుకుపోతున్నాయి. ఒక్కోసారి ఆరు నెలలకన్నా ఎక్కువ రోజులు ఉండటంతో బియ్యం ముక్కిపోయి పురుగులు గూళ్లు కడుతున్నాయి. వీటిని సరిగ్గా శుభ్రం చేయకుండా వండటంతోనే విద్యార్థులు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి బారిన పడుతున్నారని అధికారులు భావిస్తున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మరోసారి అస్వస్థత..



లీలావతి

తాండూరు టౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో గత మంగళవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో చికిత్స పొందిన విద్యార్థినులు శుక్రవారం మరోసారి అనారోగ్యం బారినపడ్డారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వసతి గృహంలోని తొమ్మిది మందిని తాండూరులోని మాతాశిశు ఆస్పత్రికి తరలించగా, మరో విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆందోళన చెందాల్సిన పనిలేదని, బాలికల ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.



లగచర్ల గేట్ దగ్గర ధర్నా చేస్తున్న గిరిజన మహిళలు

మా వాళ్లను విడిచిపెట్టండి

ప్రాణాలతో పంపిస్తారా.. శవాలుగా అప్పగిస్తారా?

- లగచర్ల గేట్ వద్ద బాధితుల ఆందోళన
- రోడ్డుపై బైఠాయించిన మహిళలు

దుద్యాల్: లగచర్ల ఘటనలో నిందితులుగా ఉన్న తమ వాళ్లను వెంటనే విడిచి పెట్టాలని డిమాండ్ చేస్తూ రోటిబండతండా, పులిచర్లకుంటతండా, లగచర్ల గ్రామాలకు చెందిన మహిళలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. నెల రోజులు గడుస్తున్నా బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. కాయాకష్టం చేసుకుని బతికే తమపట్ల ఇంత నిర్దయగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. నెల రోజులుగా మగ వారెవరూ ఇళ్లలో లేకపోవడంతో భయం భయంగా గడుపుతున్నామని వాపోయారు. జైలులో ఉన్న వారిలో చాలా మందికి అనారోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపారు. తమ వాళ్లను ప్రాణాలతో పంపిస్తారా.. శవాలుగా అప్పగిస్తారా తెలియడం లేదన్నారు. విషయం తెలుసుకున్న బొంరాస్‌పేట ఎస్‌ఐ రవూఫ్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మహిళలకు నచ్చజెప్పారు.

వ్యర్థాలను భూమిలోనే కలియదున్నాలి

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

కేశంపేట: రైతులు సాగులో సేంద్రియ ఎరువులనే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో పలువురు రైతుల వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ... రైతులు భూముల్లో వ్యర్థాలను పొలంలోనే కలియదున్నాలని సూచించారు. దీంతో భూసారం పెంపొందడంతో పాటుగా సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుందన్నారు.సూక్ష్మజీవులతో మొక్కలకు నత్రజని,భాస్వరం, పొటాషియం ఎక్కువగా అందుతుందని చెప్పారు. ఎస్ఎస్‌పీ చల్లడంతో వరి కొయ్యల్లాంటి వ్యర్థాలు త్వరగా మురుగుతాయని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శిరీష, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సుధ, రైతులు అమర్‌నాథ్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదయ్య తదితరులు ఉన్నారు.



యాలాల పీఎస్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

నేరాలు తగ్గుముఖం

- సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం
- ఎస్పీ నారాయణరెడ్డి
- యాలాల పీఎస్ సందర్శన

యాలాల: గతంతో పోలిస్తే జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం, పీఎస్ ఆవరణలో మొక్క నాటారు. రిసెప్షన్‌లో ఫిర్యాదుదారుల వివరాలు, ఎక్కువగా వచ్చే కేసులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. యాలాల గ్రామీణ ప్రాంతం కావడంతో మేజర్ కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. కాగా ప్రజల్లో ఆర్థికపరమైన లభ్యత, వాహనాల వినియోగం పెరగడంతో తరుచూ తగాదాలు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంలో పోలీస్ సిబ్బందితో తరుచూ వాహనాల తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నప్పటికి, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని స్పష్టంచేశారు.

ఆ కాలనీల పరిధి మారుస్తాం..

తాండూరు పట్టణ శివారులోని ఇందిరమ్మ, రాజీవ్ కాలనీ పరిధిని యాలాల పీఎస్ నుంచి పట్టణ పీఎస్ పరిధిలోకి చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. పైరెండు కాలనీలు ఇప్పటికే మున్సిపాలిటీలో విలీనం అవగా శాంతిభద్రతల పర్యవేక్షణ అంశం యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉందని తెలిపారు. ఈ కాలనీలు పట్టణ శివారులో ఉండటం, సమస్యాత్మకమైనవి కావడంతో తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ విషయమై అవసరమై చర్యలకు ప్రతిపాదనలు అందజేయాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శివకుమార్, యాలాల ఎస్‌ఐ గిరి తదితరులు ఉన్నారు.

వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు

- సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం
- శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్
- భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపు
- ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ప్రసాద్ కుమార్

అనంతగిరి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. పట్టణంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో శుక్రవారం నిర్వహించి కాలేజీ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమాశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో సైన్స్, టెక్నాలజీ మానవ జీవితంలో భాగంగా మారిపోయాయని తెలిపారు. ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఉపకరణాలన్నీ పరిశోధనల ద్వారానే ఆవిష్కరించడ్డాయన్నారు. వినూత్న ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. న్యూటన్, ఐన్‌స్టీన్, సీవీ రామన్ వంటి శాస్త్రవేత్తలు భిన్నంగా ఆలోచించడంతోనే అనేక కొత్త విషయాలు ప్రపంచానికి చెప్పగలిగారని స్పష్టంచేశారు. ఆవిష్కరణలకు అంతం లేదని, ప్రస్తుతం వాడుతున్న వాటికన్నా ఆధునికమైన వస్తువులు మార్కెట్‌లోకి వస్తే డిమాండ్ ఉంటుందని వెల్లడించారు. కార్లు, కంప్యూటర్లు, ఫోన్, ఇంటర్నెట్, విమానాలు వంటివన్నీ ఈ క్రమంలో మనిషి జీవితాల్లోకి వచ్చాయని తెలిపారు. సృష్టిలోని ఇతర ప్రాణులకు నష్టం వాటిల్లకుండా కొత్త ఆవిష్కరణలకు రూపం ఇవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రైతులు, పారిశ్రామిక రంగాలకు ఉపయోగపడేలా పరిశోధనలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

విద్య వైద్యానికి ప్రాధాన్యం

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్ అన్నారు. ఇందులో భాగంగా హాస్టల్ విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచిందిదని తెలిపారు. ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ విద్యాభివృద్ధికి రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని స్పష్టంచేశారు.

వసతుల కల్పనకు కృషి

కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహాల్లో వసతులు, మంచి వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా రూ.23 కోట్లతో 786 స్కూళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని వివరించారు. మరో 216 పాఠశాలల్లో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. గురుకుల పాఠశాలల మరమ్మతులకు రూ.88 లక్షలు వెచ్చించామని వివరించారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో 398 ప్రదర్శనలో వచ్చాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ప్రిన్సిపల్ సాయిలత, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



‘ఫ్యూచర్’ సిటీకి సూపర్ పవర్!

- రెప్పపాటు కూడా కరెంట్ పోనివ్వం
- ఫీడర్లకు సెన్సార్లు.. నిరంతర మానిటరింగ్
- సిటీలో 30, శివారులో 40 శాతం డిమాండ్
- ‘సాక్షి’తో సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

సాక్షి, సిటీబ్యూరో: ‘మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాటు చేయదలిచిన ఫ్యూచర్/ఫోర్త్‌సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఫార్మా, ఐటీ అనుబంధ సంస్థలు అనేకం ఇక్కడికి రాబోతున్నాయి. ఇక్కడ నెలకొల్పే పరిశ్రమలకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని నిర్ణయించాం. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయబోతున్నాం. లైన్లను విస్తరించడంతో పాటు డిమాండ్ తట్టుకునే విధంగా కొత్త సబ్‌స్టేషన్లు, అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయబోతున్నాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం’ అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. శుక్రవారం ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన ఏమన్నారంటే..

ఏటా 30 నుంచి 40 శాతం గ్రోత్..

సాధారణంగా ప్రతి ఏటా విద్యుత్ గ్రోత్ రేటు ఏడు శాతం నమోదవుతుంది. కానీ ఈసారి డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. రూరల్ ఏరియాలో గ్రోత్‌రేట్ ఏడు శాతం ఉంటే, నగరంలో 30 శాతం, నగర శివారు మున్సిపాలిటీల్లో 40 శాతం ఉన్నట్లు గుర్తించాం. భవిష్యత్‌ను డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించాం. ఆ మేరకు 2027లో రావాల్సిన కొత్త సబ్‌స్టేషన్లను 2025లోనే తీసుకురాబోతున్నాం. డిస్కం పరిధిలో మొత్తం 164 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచాం. వీటిలో ఒక్క గ్రేటర్ జిల్లాల్లోనే 88 సబ్‌స్టేషన్లు రాబోతున్నాయి. బంజారాహిల్స్ సర్కిల్‌లో 5, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 9, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో 9, సికింద్రాబాద్ సర్కిల్లో 13, రాజేంద్రనగర్ సర్కిల్లో 13 చొప్పున, సైబర్‌సిటీ సర్కిల్‌లో 6, సరూర్‌నగర్ సర్కిల్ 5, వికారాబాద్‌లో 10, మేడ్చల్‌లో 18 చొప్పున కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నాం.

ఫీడర్లకు సెన్సార్లు...

నగరంలోని అన్ని సబ్‌స్టేషన్లకు మల్టీపుల్ ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ లైన్లు ఏర్పాటు చేయబోతున్నాం. ఔటర్ చుట్టూ విద్యుత్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. 400 కేవీ సబ్‌స్టేషన్లు అనుసంధానిస్తున్నాం. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం జీహెచ్‌ఎంసీ సహా అన్ని ప్రధాన ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల ఫీడర్లకు సెన్సార్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తి కరెంట్ సరఫరా నిలిచిపోతే.. వెంటనే ఆ సమాచారం సంబంధిత అధికారులకు చేరే విధంగా సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ అంబులెన్స్‌లను కూడా అనుసంధానిస్తున్నాం. ఇప్పటికే టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. మూడు మాసాల్లో పనులు పూర్తి కానున్నాయి. కనురెప్ప పాటు కూడా కరెంట్ పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు పీటీఆర్‌ల సామర్థ్యం కూడా పెంచాం. దెబ్బతిన్న డీటీఆర్‌లను మార్చుతున్నాం. సెక్షన్ల వారీగా ఎల్సీలు తీసుకుని, లైన్ల పునరుద్ధరణ చేపడుతున్నాం.

మణికొండలోనే అత్యధికం..

మణికొండ, అయ్యప్ప సొసైటీల్లో అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇక్కడ ఉన్న భవనాలపై స్పష్టత లేకపోవడంతో డిమాండ్‌పై స్పష్టత కొరవడింది. దీంతో విద్యుత్ వినియోగం ఊహకందడం లేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉన్న సర్కిళ్ల పరిధిలో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయబోతున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సహా దెబ్బతిన్న డీటీఆర్‌ల స్థానంలో కొత్తవి అమర్చడం వంటి వాటిని గుర్తించి, పునరుద్ధరించడం తదితర పనులు చేపట్టాం. అలాగే.. రాజేంద్రనగర్‌లో 160, సైబర్ సిటీలో 151, మేడ్చల్‌లో 160, హబ్సిగూడలో 857, బంజారాహిల్స్‌లో 89, సికింద్రాబాద్‌లో 148, హైదరాబాద్ సెంట్రల్‌లో 250, హైదరాబాద్ సౌత్‌లో 90, సరూర్‌నగర్‌లో 12, సంగారెడ్డిలో 563 అదనపు డీటీఆర్‌లు ఏర్పాటు చేయబోతున్నాం.

న్యూస్‌రీల్

క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

గురునాథ్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: క్రీడలను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. మెరుగైన క్రీడాకారులను వెలికి తీసేందుకు ఇవి ఎంతగానో దోహదం చేస్తాయని స్పష్టంచేశారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలను గురునాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాం, ఎంపీడీఓ ఉషశ్రీ పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధుల హాస్టల్ బాట

తాండూరు: ప్రభుత్వ వసతి గృహాల్లో ఇటీవల జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో హాస్టళ్లను సందర్శించి, పరిస్థితులను సమీక్షించాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు శనివారం హాస్టళ్లను సందర్శించనున్నారు.

బాలలకు.. బల్లల మోత!



బల్లలు మోసుకెళుతున్న విద్యార్థులు

బషీరాబాద్: పాఠాలు నేర్చుకోవడానికి బడికి వెళ్లిన పిల్లలు బల్లలు మోయడం.. బషీరాబాద్ మండలం జీవన్గీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కనిపించింది. స్కూల్‌లోని సైన్స్ రూమ్ శిథిలావస్థకు చేరడంతో అందులోని బల్లలు, కుర్చీలు, బీరువాలను మరో గదిలోకి మార్చాలని ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ భావించారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్‌కు విజ్ఞప్తి చేయగా.. ఇద్దరు కార్మికులను పంపించారు. వారు వచ్చి సామగ్రిని తరలిస్తుండగా.. లీజర్ పీరియడ్‌లో బయట ఆడుకుంటున్న విద్యార్థులు బల్లలు, కుర్చీలు మోశారు. ఈ విషయమై హెచ్‌ఎంను వివరణ కోరగా.. తాను సెలవులో ఉన్నానని, కార్మికుల చేత సామగ్రిని తరలించే సమయంలో పిల్లలే వారికి సాయం చేశారని, విద్యార్థులను బల్లలు మోయమని ఎవరూ ఆదేశించలేదని స్పష్టం చేశారు.

రైతుల పక్షాన పోరాటం

మాజీ మంత్రి సబితారెడ్డి



కందుకూరు ఏఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రైతులకు రుణమాఫీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలో ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారని..? ఎంతమంది రైతులది పెండింగ్‌లో ఉంది చెప్పాలని ఏఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిగా రుణమాఫీ అయ్యే వరకు రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, మేఘనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, ప్రశాంత్‌చారి, కొండల్‌రెడ్డి, జంగయ్య, రవీందర్, ఉమాకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు కోకాపేటకు సీఎం రాక

మణికొండ: కోకాపేటలో శనివారం కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ (కురుమ ఆత్మగౌరవ భవనం)ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కురుమలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌లు కోరారు. శుక్రవారం వారు బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

విధినిర్వహణలో కార్యదర్శి నిర్లక్ష్యం

చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీఓకు గ్రామస్తుల ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

దౌల్తాబాద్: గ్రామ కార్యదర్శి జైపాల్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని మండల పరిధి బిచ్చాల గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యదర్శి గ్రామానికి సరిగా రావడం లేదని, ఫోన్ చేసినా స్పందిచడం లేదని ఆరోపించారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ విచారణ అనంతరం, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

పరిగి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన రంగాపూర్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి 11 గంటలకు చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి మాధారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి, బోయిన మహేశ్.. గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఫ్లెక్సీలతో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో రంగాపూర్ తండా సమీపంలో పరిగి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 29జెడ్ 3471) వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో యాదగిరి ఎడమ కాలు విరగగా కోమాలోకి వెళ్లాడు. మహేశ్‌కు ఎడమ కాలు విరిగింది. వీరిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ధారూరు: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు కిష్టయ్య సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. స్టేషన్ ధారూరు కేంద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు కిష్టయ్య విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఇదే విషయమై.. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు.. అనంతరం నివేదికను డీఈఓకు అందజేశారు. దీంతో కిష్టయ్యను విధుల నుంచి తొలగిస్తూ ఆమె ఉత్తర్వులు జారీ చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ఇబ్రహీంపట్నం: కుష్టు వ్యాధి నిర్మూలన కోసం కేంద్ర బృందం దండుమైలారం గ్రామంలో శుక్రవారం పర్యటించింది. సెంట్రల్ లెప్రసీ టీమ్‌కు చెందిన డా.హరికృష్ణ, డా.బాలకృష్ణలతో కూడిన బృందం గ్రామంలో సర్వే నిర్వహించి, కుష్టువ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నాయా అనే విషయంపై ఆరా తీశారు. దండుమైలారం పీహెచ్‌సీ పరిధిలోని ఆరుగురు కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యంపై పరిశీలన చేశారు. అనంతరం వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు వీరి వెంట ఉన్నారు.



పెళ్లిచేసుకోమన్నందుకు గొంతుకోశాడు

- వీడిన హత్యాయత్నం మిస్టరీ
- ఇద్దరు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పూడూరు: వివాహిత గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ నెల 10న జరిగిన సంఘటనపై శుక్రవారం మన్నెగుడ ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబి ఫాతిమా(40) కొంతకాలంగా భర్తకు దూరంగా ఉంటోంది. చాంద్రాయణగుట్ట పటేల్‌నగర్, బండ్లగుడలో ఆమె అద్దె ఇంటో నివాసం ఉంటోంది. పక్క ఇంట్లో ఉంటున్న సాగొళ్ల రాజ్‌కుమార్‌తో ఏర్పడిన పరిచయం వివాహేతర బంధానికి దారితీసింది. ఇది రాజ్‌కుమార్ కుటుంబీకులకు తెలియడంతో వారిట్లో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో తనను వివాహం చేసుకోవాలని పాతిమా రాజ్‌కుమార్‌పై ఒత్తిడి పెంచడంతో ఆమెను ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు.

కుమారుడి సహకారంతో..

ఫాతిమాను హతమార్చేందుకు రాజ్‌కుమార్.. తన కుమారుడు ప్రభు అలియాస్ శ్రీను సహకారం కోరాడు. పథకం ప్రకారం ఇద్దరు కలిసి పాతిమాను.. ఈ నెల 9న సాయంత్రం అరాంఘర్ నుంచి బస్సులో మన్నెగుడకు తీసుకెళ్లారు. విస్డం స్కూల్ సమీపంలో ఉన్న ఫాంహౌస్‌లో ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఆమె మత్తులోకి జారుకోగానే.. వెంటతెచ్చుకున్న పదునైన కత్తితో ఫాతిమా గొంతు కోశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె స్పృహతప్పి పడిపోయింది. చనిపోయిందని భావించిన నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెల్లవారు జామున స్పృహలోకి వచ్చిన ఫాతిమా.. నడుచుకుంటూ మన్నెగుడ కూడలి రాజాహోటల్ వద్దకు రావడంతో అక్కడి వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పక్కా సమాచారంతో విచారణ చేపట్టారు. తమదైన శైలిలో విచారించడంతో నిందితులు రాజ్‌కుమార్, ప్రభు నేరం అంగీకరించారు. వీరివురిని రిమాండ్‌కు పంపారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతును ఉగ్రవాదిగా చూడటం సిగ్గుచేటు

- బేడీలు వేయడం రాజ్యాంగ విరుద్ధం
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: లగచర్ల ఘటనలో సంగారెడ్డి జైలులో ఉన్న రైతుకు గుండెపోటు వస్తే.. బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. రైతును ఉగ్రవాదిగా చూడటం సిగ్గుచేటన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తమ భూములను కాపాడుకోవడంలో జరిగిన పోరపాటును కొంతమంది రాజకీయం చేసి, రైతులను జైలు పాలు చేశారని విమర్శించారు. రైతులకు బేడీలు వేసిన అధికారులతో పాటు ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 21 ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి బేడీలు వేయరాదని సూచించారు. రాజ్యాంగం ఖైదీలకు కల్పించిన హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. అనారోగ్యానికి గురైన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రయ్య, సత్తయ్య, చెన్నారెడ్డి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న లాల్‌కృష్ణ

- హాజరుకానున్న మంత్రులు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ

పరిగి: మార్కెట్ నూతన పాలకవర్గం ఈ నెల 15న ప్రమాణం చేయనుందని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిగి మార్కెట్ కమిటీ ప్రమాణం అనంతరం పరిగిలో రూ.5కోట్లతో మున్సిపల్ భవనం, రూ.2 కోట్లతో బంజార భవనం, రూ.6 కోట్లతో లక్నాపూర్ రోడ్డు నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. కావున కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తలు తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, డైరెక్టర్లు శాంతుకుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ క్షేమంగానే ఉన్నారు

- బాలికలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం..
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

తాండూరు టౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలైన విద్యార్థినులకు మెరుగైన వైద్య చికిత్స అందజేస్తున్నామని మండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. అందరూ క్షేమంగానే ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన.. అస్వస్థతకు గురైన బాలికలను పరామర్శించి మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ గురించి విచారణ జరుగుతోందని చెప్పారు. ఓ బాలిక లీలావతిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారని వెల్లడించారు. ఆమె పరిస్థితి బాగానే ఉందని పేర్కొన్నారు. బాలిక పరిస్థితిని స్వయంగా సమీక్షిస్తామని చెప్పారు.

తండ్రిని హతమార్చిన తనయుడికి జీవిత ఖైదు

రూ.వేయి జరిమానా



నిందితుడు అనురాగ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయికి బానిసైన ఓ యువకుడు తండ్రిని హతమార్చిన ఘటనలో శుక్రవారం న్యాయ స్థానం శుక్రవారం తీర్పునిచ్చిందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన తిరుపతి రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్ సమీపంలోని ఆరెంజ్ అవెన్యూలో నివాసం ఉండేవారు. రవీందర్ పెద్ద కుమారుడు అనురాగ్ ఇంట్లోనే ఉంటూ గంజాయి సేవిస్తుండేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. దురలవాట్లు మానుకోవాలి.. పని చేసుకోవాలని మందలించడంతో తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం.. లీటర్ బాటిల్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 4న మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తల్లి సుధ స్నానానికివెళ్లగా తండ్రి భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో రవీందర్ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వెంటనే రవీందర్ మంటలతో ఇంట్లోంచి బయటకు పరుగుగెత్తుకుంటూ వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. వెంట వెళ్లిన అనురాగ్ తండ్రి తలపై బండరాయి వేసి క్రూరంగా హత్య చేశాడు. తల్లి సుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పూర్తి వా దనలు విన్న తదుపరి ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ శోభారాణి వాదించా రు. తండ్రిని హతమార్చడం నేరంగా పరిగణించిన మెజిస్ట్రేట్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

31లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తిచేయాలి

- అర్జీ దారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈ నెల 31లోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. జిల్లా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వచ్చిన అర్జీ దారుల వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సూచించారు. గ్రామం, వార్డు పరిధిలో పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. అనంతరం దరఖాస్తు దారుల కులం, చిరునామా, ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫొటో, ఇంటి లోపల, బయట ఫొటోలు, అలాగే కొత్తగా నిర్మించ తలపెట్టిన ఇంటి స్థలం, దానికి సంబంధించిన వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్లు, వార్డు ఆఫీసర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరి(చరిత్ర) సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెల్ట్, సెట్‌లు అదనపు అర్హతలుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈనెల 17లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పురుగుల అన్నమే దిక్కా!



పురుగులు ఉన్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- మధ్యాహ్న భోజనంలో నాణ్యతేది?
- విద్యార్థుల ఆందోళన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధి బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పలువురు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. దీంతో వారు ఆందోళన వక్తం చేశారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. భోజనంలో నాణ్యత పాటించకుండా.. నిర్వాహకులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మండిపడ్డారు. భోజనంలో నాణ్యత ఎందుకు పాటించడం లేదని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమై ఎంఈఓ వెంకట్‌ను వివరణ కోరగా.. ప్రతి పాఠశాలకు కొత్తగా బియ్యం వచ్చాయని, ఏదో ఒక ప్యాకెట్‌లో పురుగులు వచ్చి ఉంటాయని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందేలా చూస్తామని వెల్లడించారు.

తాపీ మేస్త్రీ బలవన్మరణం



వెంకటేశ్ మృతదేహం

కొందుర్గు: మద్యం మత్తులో భార్యతో గొడవపడిన ఓ తాపీ మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా జరుగుమల్లె మండలం కామయ్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(37), ఇంద్రజ దంపతులు 15 ఏళ్ల క్రితం కొందుర్గుకు వచ్చి స్థిరపడ్డారు. వీరికి కొడుకు, కూతురు సంతానం. వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కిరాయి ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న వెంకటేశ్ గురువారం సాయంత్రం కూడా మద్యం సేవించి రావడంతో భార్య ఎందుకు తాగావని ప్రశ్నించింది. దీంతో ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన వెంకటేశ్ ఇంట్లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకుని ఇంటి పైకప్పునకు ఉన్న ఇనుప కొండీకి చున్నీతో ఉరేసుకున్నాడు. భార్య ఇంద్రజ అరుపులు విన్న చుట్టు పక్కల వారు తలుపులు ధ్వంసం చేసి లోనికి వెళ్లగా కొన ఊపిరితో ఉన్న వెంకటేశ్‌ను వెంటనే కొందుర్గు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సలహామేరకు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఇంద్రజ శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ, చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80 దరఖాస్తుదారులకు రూ.34.96లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో పదిమార్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేశామన్నారు. పేదలను వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రజా ప్రభుత్వం పలు పథకాలను రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

స్వచ్ఛతలో ముందంజ

- తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీలకు అరుదైన గౌరవం
- ఈ నెల 19న న్యూ ఢిల్లీలో నిర్వహించనున్న సదస్సుకు ఆహ్వానం
- రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీల కమిషనర్లకు పిలుపు

తుర్కయంజాల్: జిల్లాలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి ఈ నెల 19వ తేదీన న్యూ ఢిల్లీలోని కేంద్ర విజ్ఞాన కేంద్రం(సెంటర్ ఫర్ సెన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్-సీఎస్ఈ), హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించనున్న చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. న్యూ ఢిల్లీలోని హాబిటాట్ సెంటర్‌లోని సిల్వర్ ఓక్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించనున్నారు. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రా, నేషనల్ మిషన్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా సిటీ సాలిడ్ వేస్ట్ యాక్షన్ ప్లాన్ (సీఎస్‌డబ్ల్యూఏపీ) అమలులో సత్ఫలితాలను సాధించినందుకు ఈ గుర్తింపు లభించనుంది. ఎంపికైన మున్సిపాలిటీల కమిషనర్‌లు వారి అనుభవాలను పంచుకునేందుకు అవకాశం కల్పించనున్నారని సమాచారం. పట్టణాల్లో మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) స్థితిని కొనసాగించడంతో పాటు, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే మున్సిపాలిటీలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నాయి.

ఎంపికైన మున్సిపాలిటీలు ఇవే

రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీల కమిషనర్‌లకు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఇప్పటికే ఆహ్వానాలను పంపించారు. దమ్మాయిగూడ, తూప్రాన్, ఘట్‌కేసర్, ఆదిబట్ల, సూర్యాపేట, కోరుట్ల, కొత్తపల్లి, ఇల్లందు, సిద్దిపేట, మణికొండ, అమీన్‌పూర్, పీర్జాదిగూడ, తుర్కయంజాల్, హుస్నాబాద్, శంషాబాద్, నార్సింగి, మహబూబ్‌నగర్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, నాగారం మున్సిపాలిటీల కమిషనర్‌లకు నవంబర్ నెలలో ఆహ్వానాలు అందాయి. దేశంలోని 24 రాష్ట్రాల నుంచి సుమారు 100 మున్సిపాలిటీలకు ఈ అవకాశం దక్కింది.

ప్రజల సహకారంతోనే..



ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద గతేడాది కేంద్ర ప్రభుత్వ అవార్డు ఆదిబట్ల మున్సిపాలిటీకి దక్కిందని కమిషన్ బాలకృష్ణ తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలకు ఈ నెల 19న న్యూ ఢిల్లీలో జరిగే సదస్సుకు ఆహ్వానం అందడం శుభపరిణామన్నారు. ఆదిబట్లను బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దామన్నారు. చెత్తలేని మున్సిపాలిటీగా సహకారంతో ముందుకు పోతున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు.

బాధ్యత పెరిగింది



చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్‌కు ఆహ్వానం అందడం ఆనందంగా ఉంది. దేశంలోని 100 మున్సిపాలిటీల్లో తుర్కయంజాల్‌కు చోటు దక్కడం గర్వించదగ్గ విషయం. భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తాం.

– అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

ఆర్పీల అరెస్టు అమానుషం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్

ఇబ్రహీంపట్నం రూరల్: మెప్మాలో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్‌ను అరెస్టు చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల జరుగుతున్న నేపథ్యంలో ఆర్పీ(రిసోర్స్ పర్సన్స్)ల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలపడంతో ఆదిబట్ల, తుర్కయంజాల్ పరిధిలో వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు ఠాణాకు చేరుకొని ఆర్పీలకు మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న 6,000 మంది ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపాలిటీల్లో ఎస్ఎస్‌జీ, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్‌లకు బుక్ కీపింగ్ మహిళలకు బ్యాంకు, స్త్రీ నిధి నుంచి రుణాలు ఇప్పించడంలో కీలకపాత్ర వీరిదేనన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, ఝాన్సీ, పార్వతి, మాధవి, సబిత, వినోద, మహేశ్వరి, సువర్ణ, సేనిలత, శివకుమారి, జ్యోతి, మంజుల, ప్రియాంక, అపర్ణ, రాణి, విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ మెప్మా ఆర్పీలను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో నగరంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమం చేపట్టాలని మెప్మా సిబ్బంది నిర్ణయించడంతో ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్పీలకు మద్దతుగా సీఐటీయూ నాయకులు